క్లుప్తంగా

రేషన్‌కార్డులకు మళ్లీ దరఖాస్తు అవసరం లేదు

ఎల్కతుర్తి : గ్రామసభ, ప్రజాపాలనలో రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ 'మీసేవ' పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని భీమదేవరపల్లి తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామసభల్లో 2,451, ప్రజాపాలనలో 2,128 మొత్తం 4,579 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఇందులో వచ్చిన డబుల్ అప్లికేషన్లు 1,284 తీసివేయగా మిగిలిన 3,295 డేటా ఎంట్రీ చేసినట్లు తెలిపారు. ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసి సంబంధిత శాఖకు పంపించనున్నట్లు ఆయన వెల్లడించారు.

సఖి సేవలు సద్వినియోగం చేసుకోవాలి



ఆత్మకూరు : సఖి సేవలను సద్వినియోగం చేసుకోవాలని సఖి సెంటర్ లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం మహిళలకు సఖి అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా సఖి సెంటర్‌ను సంప్రదించాలన్నారు. మహిళలకు సమస్యలు ఎదురైనప్పుడు మహిళా సహాయక హెల్ప్ లైన్ నెంబర్ 181, చైల్డ్ లైన్ నెంబర్ 1098కు కాల్ చేసి రక్షణ పొందాలన్నారు. కార్యక్రమంలో కేసు వర్కర్ భారతి, ఏబీఎస్ లలితా దేవి, రుద్రమదేవి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కమలాపూర్ : మండలంలోని శనిగరం, గూనిపర్తి విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు చేపడుతున్న కారణంగా నేడు (శనివారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ కమలాపూర్ సెక్షన్ ఏఈ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. రెండు సబ్‌స్టేషన్ల పరిధిలోని శనిగరం, మాదన్నపేట, గోపాల్‌పూర్, లక్ష్మీపూర్, నేరెళ్ల, గూనిపర్తి, అంబాల శ్రీరాములపల్లి గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు, రైతులు విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని ఏఈ కోరారు.

నేడు మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సెమినార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 15న ఒకరోజు సెమినార్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భిక్షాలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీడియో ఎన్‌కోడింగ్ యూసింగ్ ఎంఎల్ అనే అంశంపై విశ్వవిద్యాలయంలోని పరిపాలన భవనం సెనెట్ హాల్‌లో ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మత్తుపదార్థాలకు అలవాటు పడొద్దు



ఎల్కతుర్తి/దామెర: విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఎల్కతుర్తి, దామెర ఎస్సైలు సాయిబాబు, అశోక్ విద్యార్థులకు సూచించారు. వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు శుక్రవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లోని ఏకేవీఆర్ జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్ విద్యార్థులకు, దామెర మండలం ఒగ్లాపూర్ కేర్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో పోలీసు బృందం ఆటపాటలతో మత్తు పదార్థాలతో కలిగే అనార్థాలపై అవగాహన కల్పించారు. యువత డ్రగ్స్, గుట్కా వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎవరైనా గంజాయ్ అమ్మినా, సేవించినట్లు తెలిసినా వెంటనే 8712584473 నంబర్ గల మొబైల్‌కు సమాచారం అందించాలన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాలు, 100 డయల్, షీటీమ్స్ పై అవగాహన కల్పించారు. విద్యార్థులు తల్లిదండ్రులు చెప్పిన విధంగా నడుచుకొని చదువుపై ఏకాగ్రత సారించి రానున్న వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్ భూపతి శ్రీకాంత్, సంపత్, కాలేజ్ యాజమాన్యం, అధ్యాపక బృందం, కేర్ కాలేజి ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధీర్‌కుమార్, కళాబృందం ఇన్‌చార్జ్ నాగమణి, కళాబృందం ఇన్‌చార్జ్ నాగమణి పాల్గొన్నారు.



ప్రమాదకరంగా బీటీ రోడ్డు

- మరమ్మతు చేపట్టాలని గ్రామస్తుల డిమాండ్
- పట్టించుకోని అధికారులు



ప్రమాదకరమైన మలుపు



గుంతలు పడి దెబ్బతిన్న బీటీ రోడ్డు

ఐనవోలు: మండలంలోని కక్కిరాలపల్లి–వర్ధన్నపేట మండలం పరిధిలోని ఇల్లంద గ్రామాల మధ్య పంచాయతీ రాజ్ బీటీ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఐనవోలు–ఇల్లంద గ్రామాల మధ్య దూరం 5 కిలోమీటర్లు ఉండగా గతంలోనే బీటీ రోడ్డు వేశారు. ఈ రోడ్డు అష్టవంకరలు ఉండగా పలు చోట్ల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. బీటీ రోడ్డు చాలా చోట్ల ధ్వంసమై వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. అదేవిధంగా రోడ్డుకు ఇరువైపుల పిచ్చి, ముళ్ల చెట్లు రోడ్డుపైకి రావడం ప్రమాదకరంగా ఉన్నాయి. మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించవు. దూరం నుంచి హారన్ మోగిస్తే కానీ వాహనాలు వచ్చేది తెలియని పరిస్థితి. కొన్ని చోట్ల రోడ్డుకు ఆనుకుని కందకాలు ఉండటం అత్యంత ప్రమాదకరంగా మారింది. ప్రమాదకర మలుపుల కారణంగా పలువురు ప్రమాదాల బారిన పడ్డారు. ఇల్లంద నుండి రాత్రి వేల కక్కిరాలపల్లికి వెళ్లాలంటే ప్రయాణికులు జంకుతున్నారు. చుట్టూ తిరిగి ఐదు కిలోమీటర్ల మేర అదనపు ప్రయాణం చేస్తున్నారు. పలు చోట్ల ధ్వంసమైన రోడ్డు ఇంత ప్రమాదకరంగా ఉన్నప్పటికీ సంబంధింత పంచాయతీ రాజ్ అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీరాజ్ అధికారులు స్పందించి బీటీ రోడ్డు మరమ్మత్తులు చేపట్టాలని వడ్డెరగూడెం, కాశగూడెం గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు.

ధ్వంసమైన రోడ్డు

కక్కిరాలపల్లి–ఇల్లంద రోడ్డు చాలా చోట్ల ధ్వంసమై ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. పలు చోట్ల రోడ్డుపై కంకర తేలి మరి కొన్ని చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డుకు ఇరువైపుల సైడ్ బర్మ్‌లు మట్టి కొట్టుకుపోగా రోడ్డు ధ్వంసమైంది. పలు చోట్ల వివిధ కారణాలరీత్యా రోడ్డు కటింగ్ ఉండటంతో ఈ రోడ్డు వెంట ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు దృష్టి సారించి రోడ్డును మరమ్మతు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

దెబ్బతిన్న రోడ్డును బాగు చేయాలి



నాలుగేళ్లుగా ఈ రోడ్డును ఎవరూ పట్టించుకుంట లేరు. గుంతల రోడ్డు ప్రమాదకరంగా ఉంది. రాత్రి వేళ అవగాహన లేని ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డుపై గుంతలు లేకుండా బీటీ వేసి రోడ్డుకు ఇరువైపుల మొరం పోసి వాహనదారుల ఇబ్బందులు తొలగించాలి.

– ఎండీ రఫిక్, కాశగూడెం, కక్కిరాలపల్లి

పౌష్టికాహారంతోనే పిల్లల ఎదుగుదల

- ఏపీఎం శ్రీధర్ రెడ్డి



మహిళలతో హ్యాండ్ వాష్ చేయిస్తున్న ఏపీఎం శ్రీధర్‌రెడ్డి

శాయంపేట : పౌష్టికాహారంతోనే పిల్లలు ఎదుగుదలతో పాటు ఆరోగ్యంగా ఉంటారని, ప్రతి ఒక్కరు తప్పనిసరిగా తమ పిల్లలకు పౌష్టికాహారం అందించాలని ఏపీఎం శ్రీధర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సురేఖ మండల సమాఖ్య కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం వీఓఏలకు, వీఓ అధ్యక్ష, కార్యదర్శులకు, విఓ హెల్త్ సబ్ కమిటీ సభ్యులకు ఆహారం, పౌష్టికాహారం, ఆరోగ్యం, వాష్ కార్యక్రమాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ చిన్నారులతో పాటు పెద్దలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాలు, గుడ్లు, ఆకుకూరలు. పంపు దినుసులు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం సురేఖ మండల సమాఖ్య ఆవరణలో మహిళలతో చేతులను శుభ్రంగా ఎలా కడుక్కోవాలో చూపించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారిత జెండర్ స్పెషలిస్ట్ సర్ణలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునితారెడ్డి, సీసీలు కేదారి, విజయ్‌కుమార్, ప్రభాకర్, హేమలత, సురేఖ మండల సమాఖ్య కార్యదర్శి అబేదా, కోశాధికారి లావణ్య, వీఓ ఏలు, వీఓల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను కాపాడండి



శాయంపేట : ప్రతి ఒక్కరూ ఆడ పిల్లలను కాపాడి మగ పిల్లలతో సమానంగా ఆడపిల్లలను పెంచాలని జిల్లా మహిళా సాధికారిత జెండర్ స్పెషలిస్ట్ స్వర్ణలత అన్నారు. శుక్రవారం స్థానిక అంగన్‌వాడి కేంద్రంలో బేటి బచావో–బేటి పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణలత మాట్లాడుతూ ఆడపిల్లల నిష్పత్తి రోజు రోజుకు తగ్గిపోతుందని ఆడ పిల్లలతో మానవ మనుగడ ఉందని, ఆడపిల్లలను రక్షించుకోవాలని తెలిపారు. అనంతరం గర్భిణులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కేంద్రం ఆవరణలో ఆమె మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునితారెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు రత్నమాల, జ్యోత్స్న, స్వేత, చైల్డ్ లైన్ వర్కర్ మానస, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతలో మహిళలదే అగ్రస్థానం

- సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కార్యదర్శి డాక్టర్ పల్లెపాడు దామోదర్



సమావేశంలో మాట్లాడుతున్న దామోదర్

ఆత్మకూరు : సామాజిక బాధ్యతలో మహిళలదే అగ్రస్థానమని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కార్యదర్శి డాక్టర్ పల్లెపాడు దామోదర్ అన్నారు. మండలంలోని పెద్దాపూర్‌లో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల స్థాయిలో మహిళా సహాయక కమిటీ సభ్యులకు లింగాధారిత హింస నివారణ పరిష్కారాలపై శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన దామోదర్ మాట్లాడుతూ సామాజిక చైతన్యంలో ముఖ్యపాత్ర వహిస్తూ గ్రామంలోని సమస్యలను పరిష్కరిస్తూ మహిళలు అభివృద్ధికి సహకరిస్తున్నారన్నారు. మహిళలు ఆడపిల్లలపై జరుగుతున్న దాడులను వ్యతిరేకించాలని ప్రతిఘటించే విధంగా సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రజిత, యూత్ అధ్యక్షుడు సురేష్, రైతు సంఘం అధ్యక్షుడు సాంబయ్య, జయ, ప్రభాకర్, విజయ, చాపర్తి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

హైనా దాడిలో మరో దూడ మృతి

- భయాందోళనలో రైతులు, గ్రామస్తులు
- బోను ఏర్పాటు చేసిన ఫారెస్ట్ అధికారులు



ఐనవోలు: మండలంలోని గర్మిళ్లపల్లి గ్రామ వ్యవసాయ బావుల వద్ద ఉన్న దొడ్లలో పశువులపై గురువారం రాత్రి మరోసారి హైనా దాడి చేసింది. ఈఘటనలో గండు రాజుకు చెందిన మరో దూడ మృతి చెందింది. వారం రోజుల వ్యవధిలో మూడు సార్లు హైనా దాడి చేసి దూడలను చంపింది. దీంతో గ్రామస్తులు, రైతులు ఆందోళన చెందుతున్నారు. అటవీ శాఖ అధికారులు మాటు వేసి హైనాను బంధించాలని రైతులు కోరుతున్నారు. కాగా.. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ భిక్షపతి ఇతర అధికారులతో కలిసి ఇప్పటికే పలుమార్లు గ్రామంలో పర్యటించారు. గ్రామస్తుల విన్నపం మేరకు హైనాను ట్రాప్ చేసి బంధించాలనే ఉద్దేశ్యంతో శుక్రవారం ఐదుగురు సభ్యుల రెస్క్యూ టీంను గ్రామానికి పంపించారు. రెస్క్యూ టీం బోనును ఏర్పాటు చేసి మూగజీవాలపై దాడి చేసే జంతువును ట్రాప్ చేయడానికి తగు ఏర్పాట్లు చేశారు. రాత్రి గ్రామంలోనే చుట్టు పక్కల రైతులతో కలిసి పర్యవేక్షించనున్నారు. రెస్క్యూ టీంలో కప్పల కృష్ణస్వామి, మంద శంకర్, ఎర్ర స్వామి, ఎం.స్వామి, ఎ.కొంరయ్య ఉన్నారు.

క్రైం కార్నర్

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



కమలాపూర్ : మానేరు వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను మండలంలోని మర్రిపల్లిగూడెం శివారులో శుక్రవారం పట్టుకున్నట్లు సీఐ హరికృష్ణ తెలిపారు. మండలంలోని మర్రిపల్లిగూడెం శివారులో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం విలాసాగర్ మానేరు వాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద ఇసుక తరలింపునకు సంబంధించి ఎలాంటి అనుమతులు లేకపోవడంతో మూడు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. వీణవంక మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన రామంచ పరశురాం, జమ్మికుంట మండలం కోరపల్లికి చెందిన ఆకు అశోక్, విలాసాగర్‌కు చెందిన రామంచ నాగరాజు అనే ట్రాక్టర్ డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్య తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

తప్పిన ప్రమాదం

మర్రిపల్లిగూడెం శివారులో పోలీసులు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుంటున్నారన్న విషయం తెలియగానే ఓ ఇసుక ట్రాక్టర్ డ్రైవర్ ఇసుకను అన్‌లోడ్ చేసి పోలీసులకు దొరక్కుండా అతివేగంగా వెళ్తున్న క్రమంలో ట్రాక్టర్ టేలా డోర్ ఊడిపోయి మండలంలోని పంగిడిపల్లిలో ఓ స్కూల్ వ్యాన్‌ను తాకుతూ పోయింది. దీంతో స్కూల్ వ్యాన్ స్వల్పంగా దెబ్బతినగా విద్యార్థులకు తృటిలో పెనుప్రమాదం తప్పింది.

రేషన్‌బియ్యం పట్టివేత.. ఒకరిపై కేసు



ఎల్కతుర్తి : సూరారం గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యం ఉన్నాయన్న పక్కా సమాచారం మేరకు స్థానిక ఎస్సై ప్రవీణ్‌కుమార్ శుక్రవారం తన సిబ్బందితో వెళ్లి 31 క్వింటాళ్ల రేషన్ బియ్యంను పట్టుకున్నారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు..భీమదేవరపల్లి మండలం కొప్పూర్ గ్రామానికి చెందిన నర్రావుల ఆంజనేయులు ప్రజల వద్ద నుంచి రూ.10కి కొనుగోలు చేసి వాటిని తిరిగి రూ.16 చొప్పున కోళ్ల ఫామ్‌లకు విక్రయిస్తున్నాడు. నిల్వ చేసిన రేషన్‌బియ్యం బస్తాలను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఆంజనేయులు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. పట్టుబడిన బియ్యం విలువ రూ.49,600లు ఉంటాయని పేర్కొన్నారు.

నియామకం

గీసుకొండ : మండలంలోని బొడ్డుచింతలపల్లికి చెందిన డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జాతీయ అవార్డు గ్రహీత, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు కేదాసి మోహన్ బహుజన సాహిత్య అకాడమీ (బీఎస్‌ఏ) రాష్ట్ర అవార్డుల సెలక్షన్ కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో మోహన్ విలేకరులతో మాట్లాడారు. మార్చి 25న నిర్వహించనున్న అకాడమీ 18వ నేషనల్ కాన్ఫరెన్స్‌లో అవార్డుల ఎంపిక కోసం దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు.

సమాజానికి దోహదపడే షార్ట్‌ఫిల్మ్‌లు రావాలి

పరకాల: సమాజానికి దోహదపడే షార్ట్ ఫిల్మ్‌తో యువత భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలువాలని పట్టణ కాంగ్రెస్ సమన్వయ కమిటీ సభ్యుడు సోదా రామకృష్ణ అన్నారు. పట్టణంలోని రాజీపేట కాలనీకి చెందిన గోవింద శ్రీనివాస్ దర్శకత్వంలో రూపొందిస్తున్న డీ డాటర్ షార్ట్‌ఫిల్మ్‌ను పరకాల కూరగాయల మార్కెట్ ఆవరణలో ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ షార్ట్ ఫిల్మ్‌లు అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని కోరారు. తెలంగాణ నుంచి చిత్ర పరిశ్రమరంగంలో అడుగుపెట్టాలని కోరుకుంటున్న కళాకారులకు తన వంతు సాయం ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఏకు రాజు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, నాయకులు పసుల రమేష్, నల్లెల అనిల్, బండి సదానందం, మార్క రఘుపతి, దేవయ్య, బొబ్బిలి, రంజిత్, ఎం.డీ అలీ, క్రాంతి పాల్గొన్నారు.



షార్ట్ ఫిల్మ్‌ను ప్రారంభిస్తున్న సోదా రామకృష్ణ

రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం



వేలేరు : ప్రధాన రహదారిపై విద్యుత్ స్తంభం ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో రోడ్డు విస్తరణలో భాగంగా రెండేళ్ల క్రితం రోడ్డు వేశారు. ప్రధాన రహదారి వెంట సుభాష్ విగ్రహం (కాలనీ) వద్ద నడిరోడ్డుపై హైమాస్ట్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. అప్పటి నుంచి నడిరోడ్డుపై ఉన్న హైమాస్ట్ స్తంభాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. ఏదైనా ప్రమాదం జరిగితే తప్ప స్పందించరా అంటూ అధికారులను స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నడిరోడ్డుపై ఉన్న హైమాస్ట్ స్తంభాన్ని తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

- సీపీ అంబర్‌కిషోర్ ఝా



ఆత్మకూరు : చెక్‌పోస్టు వద్ద రికార్డులు పరిశీలిస్తున్న సీపీ అంబర్‌కిషోర్ ఝా

ఆత్మకూరు : ఇసుక అక్రమ రవాణాను అరికట్టడంలో పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సీపీ అంబర్‌కిషోర్‌ఝా అన్నారు. మండలంలోని కటాక్షపూర్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును శుక్రవారం రాత్రి ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. చెక్‌పోస్టు రికార్డులను పరిశీలించారు. స్థానిక సీఐ సంతోష్‌ను కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీపీ మాట్లాడుతూ చెక్‌పోస్టు వద్ద తనిఖీలు పటిష్టంగా నిర్వహించాలని అన్నారు. చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వర్తించే సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండొద్దన్నారు. కేసుల విషయాలను ఎప్పటికప్పుడు తెలియచేయాలన్నారు.



ఐనవోలు : చెక్‌పోస్టు తనిఖీ చేస్తున్న మామునూరు ఏసీపీ తిరుపతి

చెక్‌పోస్టు తనిఖీ

ఐనవోలు : అక్రమ ఇసుక రవాణాను అరికట్టడానికి సీపీ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు పోలీసులు మండలంలోని పున్నేలు క్రాస్ సమీపంలో వరంగల్–ఖమ్మం రహదారిపై చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. శుక్రవారం మామునూరు ఏసీపీ తిరుపతి, పర్వతగిరి సీఐ రాజగోపాల్ నూతనంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అనుమతులు లేకుండా ఇసుక తరలించే వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు.

భద్రతా నియమాలు పాటించాలి

ఆత్మకూరు : వాహనదారులు భద్రతా నియమాలను పాటించాలని సీఐ సంతోష్ అన్నారు. మండలంలోని గూడెప్పాడ్‌లో జాతీయ రహదారిపై శుక్రవారం వాహనాల తనిఖీ, డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. ట్రైనీ ఎస్సై శ్రావణ్ కుమార్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



వాహనాన్ని తనిఖీ చేస్తున్న సీఐ సంతోష్

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

- వాటర్‌ట్యాంకు ఎక్కి నిరసన తెలిపిన మాజీ సర్పంచ్



వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలుపుతున్న మాజీ సర్పంచ్ ఊర రవీందర్ రావు

నడికూడ : గ్రామాభివృద్ధి కోసం చేసిన పనులకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ స్థానిక మాజీ సర్పంచ్ ఊర రవీందర్‌రావు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని నూతన గ్రామ పంచాయతీ భవనానికి, మన ఊరు–మన బడిలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్మించిన డైనింగ్ హాల్‌కు తాళం వేసి, అనంతరం గ్రామంలోని వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపాడు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ రూ.51.50 లక్షలు గ్రామంలో అభివృద్ధి పనులు చేయడం జరిగింది. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం 14 నెలలుగా పెండింగ్ బిల్లులు చెల్లించకుండా ఇబ్బందిపెడుతున్న తరుణంలో మేము అప్పులు చేసి తెచ్చిన డబ్బులకు వడ్డీలు కట్టలేక మేము ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితిలో ఉన్నామని అన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి స్పందించి వీలైనంత వరకు త్వరగా పెండింగ్ బిల్లులు చెల్లించి మమ్మల్ని ఆదుకోవాలని కోరారు.

'అగ్రంపహాడ్'లో భక్తుల మొక్కులు

ఆత్మకూరు : మినీ జాతరను పురస్కరించుకొని మండలంలోని అగ్రంపహాడ్ సమ్మక్క–సారలమ్మ జాతరలో శుక్రవారం భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. వరంగల్ నగరంతో పాటు వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. తల్లులకు పసుపు, కుంకుమ, బంగారం, కానుకలు సమర్పించారు.



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



ఎత్తుబంగారంతో వస్తున్న భక్తులు



తలనీలాలు సమర్పిస్తున్న భక్తులు

మార్చి 25లోగా పనులు పూర్తి చేయాలి

- అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాస్‌రావు



మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాస్‌రావు

కమలాపూర్ : ఉపాధి భరోసా కింద అనుమతి పొందిన క్యాటిల్ షెడ్, నాడెం కంపోస్ట్ పిట్స్, పొలం బాటలు, సీసీ రోడ్లు, గ్రామపంచాయతీ భవన నిర్మాణాలు, పండ్ల తోటల పెంపకం తదితర పనులన్నీ మార్చి 25లోగా పూర్తి చేసి, వాటికి సంబంధించిన చెల్లింపులన్నీ పూర్తి చేయాలని అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాస్‌రావు ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందికి పనులపై శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇక నుంచి ప్రతి గ్రామంలో 30 మందికి ఉపాధి హామీ పనులు కల్పించాలన్నారు. గ్రామాల్లో వన మహోత్సవం కింద నాటిన మొక్కల్లో 85 శాతం మొక్కలు బతికేలా చూడాలని, రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలకు ప్రతి శుక్రవారం నీరు పోయించాలని, వాటి రక్షణ కోసం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, వాటి ఫోటోలు, లాంగ్ బుక్కులు సేకరించి ప్రతి నెలా చివరన చెల్లింపులు చేయాలన్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ కింద నిర్దేశించిన పనిదినాలను మార్చి 31 వరకు పూర్తి చేయాలని, అలా చేయని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలానికి మంజూరైన వ్యక్తిగత మరుగుదొడ్లను వారం రోజుల్లో పూర్తి చేయించాలని, ప్రతి గ్రామంలో కనీసం ఐదెకరాల్లో పండ్ల తోటల పెంపకం చేపట్టాలని, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో భాగంగా 20 రోజుల కన్నా తక్కువ పని చేసిన భూమి లేని నిరుపేదలకు ముందుగా 20 రోజులు పని కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గుండె బాబు, ఎంపీఓ రవి, ప్లాంటేషన్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా టెక్నికల్ అధికారి శ్రీధర్, ఎస్పీఎం అధికారి సంపత్, ఏపీఓ రమేష్, ఈసీ కార్తీక్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.